క్లుప్తంగా

కార్యదర్శి సస్పెన్షన్

బాసర: మేజర్ గ్రామపంచాయతీలో విధులు నిర్వహించే పంచాయతీ కార్యదర్శి గోవింద రాజును సస్పెండ్ చేసినట్లు ఎంపీడీవో అశోక్ కుమార్ తెలిపారు. బాసరలో తన విధులను సక్రమంగా నిర్వర్తించకపోవడంతో డీఎల్‌పీవో విచారణ చేపట్టి సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. బాసర పంచా యతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా ఎంపీవో గంగా సింగ్‌ను నియమించినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఆలయాభివృద్ధికి విరాళం

కుంటాల: భైంసా మండలం చాత గ్రామానికి చెందిన కులకర్ణి సుభాష్.. మండలంలోని లింబా(బి) దత్తాత్రేయ ఆలయ అభివృద్ధి కోసం రూ.5,011 నగదును మంగళవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కులకర్ణి గణేశ్, సిండె దత్తురాం, నాగమణి లింగన్న, అశోక్, రవి, సాయిపటేల్, రాజు, సునీల్, ఎల్.గంగాధర్, ఆనంద్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు చెక్కులు పంపిణీ



చెక్కును అందిస్తున్న చైర్మన్ ఈశ్వర్

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో దివ్యాంగుల సంక్షేమశాఖ తరఫున మంజూరైన రూ.50 వేల విలువైన స్వయంఉపాధి చెక్కులను దివ్యాంగులైన గోదావరి, షేక్ హుస్సేన్‌కు మంగళవారం మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అందజేశారు. కార్యక్రమంలో మెప్మా అధికారి సుభాష్, కౌన్సిలర్లు మేడారం ప్రదీప్, సాదం అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన

ముధోల్: మండల కేంద్రంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎంపీడీవో రమణారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, ఆచార్యుల అర్హత, ఫీజువసూళ్లు, ఆడిట్, గ్రంథాలయం, ప్రయోగశాల, స్పోర్ట్స్ గురించి వివరాలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. వారి వెంట సీసీవో యోగేశ్వర్, నిర్వాహకులు ఉన్నారు.

చేతి పంపునకు మరమ్మతులు



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని తిర్పెల్లి వాగు ఒడ్డున పురాతన శివాలయం వద్ద ఉన్న చేతిపంపు పనిచేయడం లేదు. దీనిపై మంగళవారం సాక్షిలో చేతిపంపునకు మరమ్మతులు చేయాలి శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన మిషన్ భగీరథ ఏఈ పుష్ప.. పంచాయతీ కార్యదర్శి విక్రమ్‌కు ఫోన్ చేసి చేతి పంపునకు మరమ్మతులు చేయించారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు గణపతి, ఉపాధ్యాయులు పండరి, రాజేశ్వర్, పద్మ, సిద్ధిరాం పాల్గొన్నారు.

నూతన నియామకం

నర్సాపూర్(జి): రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మాదిగల అంబేద్కర్ సంఘం నిర్మల్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీగా నర్సాపూర్ (జి)కి చెందిన దర్శనం రాజును నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నిగులపు లింగన్న ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలయ్యే వరకు సంఘం తరఫున పోరాడాలని సూచించారు. గ్రామ, మండల కమిటీలను ఏర్పాటు చేసి రాష్ట్ర కమిటీకి నివేదించాలని కోరారు. గౌరవ అధ్యక్షులు కోరిపల్లి శ్రీనివాస్, రాష్ట్ర న్యాయ సలహాదారు గాజుల రవికుమార్, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపాధ్యక్షుడు దర్శనం ప్రవీణ్ మహారాజు తదితరులు ఉన్నారు.

వరికొయ్యలను కాల్చొద్దు

నర్సాపూర్(జి): పొలంలోని వరికొయ్యలను కాలిస్తే భూమిలోని సారం తగ్గుతుందని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మండల కేంద్రంలోని రైతువేదికలో అధికారులు పాల్గొన్నారు. గట్లపై ఉన్న చెట్లు కాలిపోవడంతోపాటు పర్యావరణానికి హాని కలుగుతుందని పేర్కొన్నారు. డీఏవో అంజిప్రసాద్, ఏఈవోలు గణేశ్, భాగ్యలక్ష్మి తదితరులున్నారు.

బాసర: హైదరాబాద్ నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో బాసర రైతువేదిక నుంచి ఏవో శ్రీకర్, ఏఈవో గణేశ్, ఇతర రైతులు పాల్గొన్నారు. అనంతరం రైతులకు వరికొయ్యలు కాల్చడం ద్వారా కలిగే నష్టాలను వివరించారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

- సారంగపూర్ మండలంలో అధ్వానంగా పాతఎన్‌హెచ్-7
- మహబూబాఘాట్స్ ఎక్కడానికి అవస్థలు
- నిర్మల్-ఆదిలాబాద్ వెళ్లే మార్గంలో దెబ్బతిన్న రహదారి



మొదటిఘాట్ మలుపు వద్ద కోతకు గురైన రోడ్డు



గుంతలు పడిన పాత ఎన్‌హెచ్-7 రహదారి

సారంగపూర్: ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వెళ్లే పాత ఎన్‌హెచ్-7 సారంగపూర్ మండలంలో అధ్వానంగా మారింది. మండలంలోని చించోలి(బి) ఎక్స్‌రోడ్డు నుంచి మహబూబ్‌ఘాట్స్ వరకు నాలుగు కిలోమీటర్ల మేర తారులేచిపోయి గుంతలు ఏర్పడటంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పలువురు ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నా.. సంబంధిత అధికారులు మరమ్మతులు చేయించడం లేదు. చించోలి(బి) ఎక్స్‌రోడ్డు నుంచి మహబూబాఘాట్స్ ఎక్కే వరకు రోడ్డుపై తారు లేచి గుంతలు ఏర్పడ్డాయి. ఘాట్‌రోడ్డుపై నుంచి నిర్మల్ వైపునకు చేరుకునే వాహనాలు వేగంగా వచ్చిపోతుంటాయి. ఈక్రమంలో గుంతల కారణంగా వాహనాల్లో కూర్చొన్న ప్రయాణికులు ఉలిక్కిపడుతున్నారు.

మొదటి ఘాట్‌పై కోతకు గురైన రోడ్డు..

మండలంలోని మహబూబాఘాట్స్ పైకి ఎక్కే క్రమంలో మొదటి ఘాట్‌రోడ్డు మలుపు వద్ద ఇటీవలి వర్షాలకు వరద పోటెత్తి రోడ్డు కోతకు గురైంది.



గుంతలు తప్పించుకునేందుకు రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులు

దీంతో సదరు ప్రాంతం లోయగా మారింది. ఆదిలాబాద్ నుంచి నిర్మల్ వైపు వచ్చే వాహనాలు ఘాట్‌రోడ్డుపై నుంచి వేగంగా వస్తుంటాయి. ఈక్రమంలో వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా.. ప్రమాదం బారిన పడే అవకాశాలెక్కువ. వాహనాలు అదుపుతప్పి లోయలో పడిపోతే ఇక అంతే సంగతి.

రక్షణగోడలు కూలుతున్నాయి..

ఘాట్‌రోడ్డుపై పలుచోట్ల మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు, రక్షణ గోడలు నిర్మించారు. అందులో చాలా వరకు గోడలు కొంతభాగం కూలిపోగా.. మిగతా భాగం కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇక ప్రమాద హెచ్చరిక బోర్డుల ఆనవాళ్లే కనిపించకుండా పోయాయి. అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టి రక్షణగోడలు నిర్మించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

చించోలి(బి) ఎక్స్‌రోడ్డు నుంచి మహబూబాఘాట్స్ వరకు నాలుగు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఈ రహదారికి ప్యాచ్‌వర్క్ చేయరాదు.. కనుక కొత్తగా రోడ్డు నిర్మించాల్సిన అవసరం ఉంది. నిధులు విడుదల కాగానే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నాం.

– అంజనేశ్వర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సారంగాపూర్

ఇందిరాగాంధీకి ఘన నివాళి



సారంగపూర్ : స్వర్ణలో నివాళులర్పిస్తున్న చైర్మన్



కడెంలో పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నేతలు

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలో ఏఎంసీ చైర్మన్ అబ్దుల్ హాదీ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

కడెం: మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మల్లేశ్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దుర్గభవాని, పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్, రహీం, రమేశ్, రఫీక్, బొడ్డుగంగన్న, ఇందూర్‌నేత, లచ్చన్న, ధర్మయ్య, శంకర్, గంగాధర్, బ్రహ్మచారి, తదితరులున్నారు.

సోన్: మండలంలోని గంజాల్ గ్రామంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. టీపీసీసీ ప్రచార కమిటీ సంయుక్త కన్వీనర్ ఎంబడి రాజేశ్వర్, మాజీ సర్పంచ్ మొయినొద్దీన్, ఎన్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ఎంబడి రాకేశ్, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కందుల రాజేశ్వర్, దర్శనం లింగన్న, బర్కుం చిన్నవెంకటరమణ, శైవ నర్సయ్య, ఉప్పునీటి మోహన్, మల్లయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలో ఉన్న చింతలపేట్ గ్రామంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోవింద్ మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు షౌకత్‌పాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కదార్ల గంగనర్సయ్య, మైస శ్రీనివాస్, షమీ, అమీర్, జియా తదితరులు ఉన్నారు



ఖానాపూర్: జయంతిలో పాల్గొన్న నాయకులు



సోన్ : గంజాల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

‘ధాన్యంలో కోతలు విధించొద్దు’

ఖానాపూర్: కొనుగోలు కేంద్రాల్లో నిర్వాహకులు కోతలు విధించకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శివరాజ్‌కు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. దళారుల దందాను అరికట్టి.. స్వామినాథన్ కమిషన్ రిపోర్టు ప్రకారం వరిధాన్యానికి క్వింటాలుకు రూ.5428 చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్, నాయకులు గోపినర్సయ్య, దుర్గం లింగన్న, గోనె స్వామి రాజేశ్వర్, గజ్జన్న, ప్రసాద్, సత్తన్న, చిన్నరాజన్న తదితరులు ఉన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పటేల్ విగ్రహం ఏర్పాటుకు అనుమతివ్వాలి

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ముఖ ద్వారానికి ఎడమవైపు మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాశవేని ప్రణయ్, జె.లోకేశ్, రాజశేఖర్, వెంకటేశ్, నవీన్, ఉదయ్, విష్ణు, రాకేశ్, భూమేశ్, మహేశ్, రాజ్‌కుమార్, దశరథ్, రవీందర్ తదితరులు ఉన్నారు.

మరోచోట ఏర్పాటు చేయాలంటున్న కాలనీవాసులు..

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యానగర్ బస్టాప్ ముందు విగ్రహం ఏర్పాటు చేస్తే ప్రజలకు ఇబ్బంది కల్గుతుందని.. కాలనీవాసులు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. వెంటనే నిర్మాణ పనులు నిలిపివేసి మరోచోట విగ్రహం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు రాపెల్లి రవీందర్, బొప్పారపు శరత్, రాములు, నర్సయ్య, దశరథ్, శ్రీను, నవీన్, రాజ్‌కుమార్, రవి, శివ, రాజు, నరేందర్, సంపత్, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

కట్ల గంగన్న వర్ధంతి

కడెం: మండలంలోని అంబారిపేట్‌లో కామ్రేడ్ కట్ల పెద్దగంగన్న 27వ వర్ధంతి నిర్వహించారు. సీపీఎంఎల్‌నాయకులు రాజు, రాజేశ్, లింగన్న, మాజీ ఎంపీటీసీ కట్ల సింధూజసాగర్ స్థూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

లోకేశ్వరం: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌పీవో సుదర్శన్ అన్నారు. మంగళవారం రాయపూర్‌కాండ్లీ, జోహర్‌పూర్ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను సుదర్శన్ పరిశీలించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ తప్పులు లేకుండా పూర్తి సమాచారం సేకరించాలని ఎన్యూమరేటర్లకు సూచించారు. సందేహాలుంటే ఏఎస్‌వోను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎంపీడీవో వెంకటరమేశ్, సోలమాన్‌రాజ్ ఉన్నారు.

ఖానాపూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వేను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి జీవరత్నం, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అన్నారు. పట్టణంలోని శాంతినగర్, సుభాష్‌నగర్ కాలనీల్లో జరిగిన సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ తొంటి శ్రీనివాస్, నాయకులు షబ్బీర్‌పాషా, పానగంటి రాజేందర్, కమిషనర్ మనోహర్, ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులున్నారు.



లోకేశ్వరం: సర్వే పరిశీలిస్తున్న డీఎల్‌పీవో సుదర్శన్

తానూరు: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో అబ్దుల్ సమద్ సూచించారు. మంగళవారం మండలంలోని ఖర్బలా గ్రామంలో సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని గ్రామాల్లో సర్వే కొనసాగుతోంది. తమకు కేటాయించిన ఇళ్లకు ఎన్యూమరేటర్లు వివరాలు నమోదు చేసుకున్నారు.

కేజీబీవీ సందర్శన

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటామని పంచాయతీరాజ్ అధికారులు పేర్కొన్నారు. కళాశాలలో మూత్రశాలలు, డైనింగ్ హాల్ లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారని ఇటీవల డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు, కాంగ్రెస్ నాయకులు.. కలెక్టర్ అభిలాష అభినవ్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం కేజీబీవీని పంచాయతీరాజ్ డీఈ తోపి సందర్శించారు. పాఠశాలలో డైనింగ్ హాల్ ఏర్పాటు చోటును పరిశీలించారు. ఎస్‌వో నవిత, ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, ఏఈ సంజయ్‌కుమార్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్ తదితరులున్నారు.

వైభవంగా శాంతి యాగం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాల ఎదుట నిర్వహిస్తున్న శ్రీ వైష్ణవ ఆయుత చండి అతిరుద్ర మహాయాగం వైభవంగా కొనసాగుతోంది. లోక కల్యాణం కోసం ఈనెల 10న ప్రారంభమైన 84వ విశ్వశాంతి మహాయాగ మహోత్సవాలు ఈనెల 25 వరకు చేపట్టనున్నారు. మంగళవారం శ్రీకష్ణ జ్యోతి స్వరూపనంద సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య హనుమాత్ హోమాలు, సుదర్శన చండీ హోమం నిర్వహించారు. అనంతరం లక్ష తమలపాకులతో ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల భక్తులు, ప్రముఖులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఇద్దరికి గాయాలు

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్‌లో ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఖానాపూర్ నుంచి పొన్కల్‌కు చెందిన మల్లేశ్ బైక్‌పై కడెం వైపు వెళ్తున్నాడు. అటువైపు నుంచి తర్లపాడ్‌కు చెందిన రాజేశ్వర్, తమ బంధువు కడెం మండలం చిట్యాలకు చెందిన హర్షిత్‌తో బైక్‌పై ఖానాపూర్ వైపు వస్తున్నారు. తర్లపాడ్‌లో వీరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో వారు కిందపడ్డారు. స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హర్షిత్‌ను నిజామాబాద్ తరలించారు.



గాయపడిన హర్షిత్

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

భైంసారూరల్: పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని దేగాం గ్రామంలో ఉన్న తన నివాసంలో మాజీ ఎమ్మెల్యే పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన శేఖర్‌కు రూ.60వేలు, భైంసాకు చెందిన బి.మారుతి రూ.60వేలు, భైంసా మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన పోతారెడ్డికి రూ.60వేలు, లక్ష్మికి రూ.60వేలు, నర్సవ్వకు రూ.4,250, ముధోల్ మండలం తరోడ గ్రామానికి చెందిన ఫర్జానాఖానం రూ.60వేలు, విఠోలితండాకు చెందిన దేవుకబాయికి రూ.60వేల విలువైన చెక్కులు మంజూరయ్యాయి. కార్యక్రమంలో రత్నాకర్‌రావు, రాజన్న, హరీఫ్, రమేశ్, గోపి తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబసభ్యులకు చెక్కులు అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కుంటాల: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. మంగళవారం కుంటాలలోని పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో పంట తేమశాతం పరిశీలించి మాట్లాడారు. క్లీనింగ్ మిషన్లు రైతులకు అందుబాటులో ఉంచి.. కొనుగోలుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం పీఏసీఎస్ భవనంలోని ఎరువుల స్టాకును పరిశీలించారు. ఆయన వెంట సీఈవో నాగభూషణం, వీవో అధ్యక్షురాలు స్వప్న, లలిత, పలువురు సిబ్బంది కృష్ణ, గజ్జారాం తదితరులు ఉన్నారు.



పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్

‘మాలల సింహగర్జన జయప్రదం చేయాలి’

ఖానాపూర్: హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జనను జయప్రదం చేయాలని మాలమహానాడు నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని గాంధీనగర్, శాంతినగర్ కాలనీల్లో మాలల ఉపకులాల ఆధ్వర్యంలో అంబేద్కర్ జెండా ఆవిష్కరించారు. మాలలతోపాటు మాలల ఉపకులాల వారు ఐక్యమత్యంతో ఏకతాటిపైకి వస్తేనే అభివృద్ధి చెందవచ్చని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజేశ్వర్, సత్యం, మల్లేశ్, త్రివేందర్, శ్రీహరి, కిషన్, నరేశ్, రామకృష్ణ, సుమన్, బాపన్న, రాజన్న, శ్యాం, పెద్దులు, అశోక్ తదితరులు ఉన్నారు.

తానూరు: హైదరాబాద్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన కార్యక్రమానికి మాలలు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ఉమ్రి(కే)లో మాలల సిహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భీమ్‌పవార్, గంగాధర్, అవినాశ్, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



తానూరు : కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

సర్వీస్‌రోడ్డు సమస్య పరిష్కరించాలి

నిర్మల్: సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామం వద్ద ఎన్‌హెచ్-44పై ఏర్పాటు చేసిన అండర్‌పాస్ నిర్మాణంలో లోపాల కారణంగా ఇబ్బంది పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈమేరకు తమ సమస్య పరిష్కరించాలంటూ కడ్తాల్ గ్రామస్తులు మంగళవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. అనంతరం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కడ్తాల్ జంక్షన్‌లో అండర్‌పాస్ నిర్మాణ సమయంలో చెప్పినట్లు కాకుండా సర్వీస్ రోడ్డును సమస్యాత్మకంగా మార్చారని ఆరోపించారు. ఈ రోడ్డుపై నుంచే భారీవాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తులతోపాటు సమీపంలోనే పాఠశాల ఉన్నందున విద్యార్థులకు ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు. ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోవడం లేదని.. తమ గ్రామానికి సమస్యాత్మకం కాకుండా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు బర్మ దాసు, మేకల అశోక్, రహమత్, అశోక్, లక్ష్మారెడ్డి, భీమేశ్, గుర్రం గంగన్న, బర్మ రవి, గుర్రం రాము, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రామస్తులు

ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం

కడెం: డీఈవో ఆదేశాల మేరకు ఎంఈవో షేక్ హుస్సేన్ మంగళవారం మండలంలోని పాండ్వపూర్‌తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించారు. సోమవారం పాఠశాలను సందర్శించిన డీఈవో రవీందర్‌రెడ్డి వెంటేనే పాఠశాలను పునఃప్రారంభించేలా చర్యలు తీసుకున్నందుకు తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, హపావత్‌రాజేందర్, కాంప్లెక్స్ హెచ్ఎం రమేశ్, లక్ష్మీనర్సయ్య తదితరులున్నారు.



పాఠశాల ప్రారంభిస్తున్న ఎంఈవో షేక్ హుస్సేన్

విద్యార్థులకు ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీలు ప్రారంభిస్తున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ

నిర్మల్‌ఖిల్లాగేట్: గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్మల్‌లోని అంబేద్కర్ భవన్‌లో వివిధ పాఠశాలల విద్యార్థులకు ముగ్గుల పోటీలు ఏర్పాటు చేయగా గ్రంథాలయ చైర్మన్ సయ్యద్ అర్జుమంద్ అలీ ప్రారంభించారు. విజేతలకు బహుమతులు బుధవారం ప్రదానం చేయనున్నారు. వివిధ పాఠశాలలకు చెందిన 260 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.బుగ్గారెడ్డి, లైబ్రేరియన్ రాథోడ్ మోహన్‌సింగ్, విజయశ్రీ, సంజీవరెడ్డి, ఎం.రాజు, విజయశంకర్, లెనిన్, శంకర్, భూమన్న, దశరథ్‌గౌడ్, శ్రీనివాస్‌స్వామి, గంగాధర్, కృష్ణారెడ్డి ఉన్నారు.